www.aashwi.net / in

PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

మంగళవారం, 28-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :87 Issue : 87 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

గుడ్డతో ఇన్ని ప్రయోజనాలా..

7



మెగా కోడలు లావణ్య త్రిపాఠి లుక్‌పై ట్రోలింగ్.. 8

ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు..

- ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం.!
- ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభం
- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం
- రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరణ
- విద్యార్థులకు వారంలో 3 రోజులు పాలు, మరో 3 రోజులు రాగి జావ అందజేత
- మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్ర, దేశాభివృద్ధి
- సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరికాదన్న డిప్యూటీ సీఎం

2

హైదరాబాద్ మెట్రోకు మేకోవర్..

10 మోడల్ స్టేషన్ల ఏర్పాటు!

- మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు హెచ్ఎంఆర్ఎల్ (HMRL) ప్రత్యేక ప్రణాళిక.
- అదనపు ఎంబి. అజిత్ రెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన.
- ప్రయోగాత్మకంగా మోడల్ స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు 10 కీలక స్టేషన్ల ఎంపిక.
- స్టేషన్ల కింద పార్కింగ్ స్థలాల సమర్థవంతమైన నిర్వహణ మరియు పరిశుభ్రతపై ప్రత్యేక ఫోకస్.
- రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రాయదుర్గ్ స్కైవాక్, ఐటీ కనెక్టివిటీ మార్గాలపై ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ (HMRL) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మిగతా 2వ పేజీలో..

విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసన

- కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాల నిరసన
- విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎంపీలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జులై 20 'సంసద్ మార్చ్' ఘటనపై ఆగ్రహం
- పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచిన ప్రతిపక్షం
- విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్

2

ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి..

- తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక
- కాస్పియన్ సముద్రంలో ఇరాన్ వాణిజ్య నౌకపై దాడి
- ఒక నావికుడు మృతి.. మరొకరికి గాయాలు
- ఉక్రెయిన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిక
- కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలకు ఇరాన్ డిమాండ్

2

రోడ్డుపై OMR షీట్ల కలకలం..

- వివరణ ఇచ్చిన TGPSC
- రోడ్డుపై పడినవి 2018 నాటి OMR షీట్లేనని స్పష్టీకరణ
- ఇద్దరు సెక్షన్ ఆఫీసర్ల సస్పెన్షన్.. కాంట్రాక్టర్‌పై FIR, వర్క్ ఆర్డర్ రద్దు
- భవిష్యత్ పరీక్షలపై ప్రభావం లేదన్న TGPSC

2

విద్యార్థులపై దాడులు ఆపాలి

న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:

దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసుల నమోదు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని

మిగతా 2లో..

మోదీ క్షమాపణ చెప్పాలి: రాహుల్ గాంధీ

- విద్యార్థుల అణచివేతపై కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు
- ఏకే-47 కాల్పులు, లాఠీఛార్జీలపై తీవ్ర ఆగ్రహం
- విద్యార్థులపై కేసులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్న కాంగ్రెస్ ఎంపీ
- ఇచ్చిన హామీలను ప్రధాని మోదీ నిలబెట్టుకోలేదని ఆరోపణ
- దాడులకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

భారీ వర్షాల హెచ్చరిక

- ఐటీ కంపెనీలకు సైబరాబాద్ పోలీసుల కీలక సూచనలు
- సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పీక్ అవర్స్‌లో తీవ్ర ట్రాఫిక్ రద్దీపై హెచ్చరిక
- దశల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని ఐటీ సంస్థలకు విజ్ఞప్తి

2

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై కేసీఆర్ ఆందోళన.. "మా నేతను కాపాడండి"

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలుసుకున్నారు. సోమవారం స్వయంగా సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అందుతున్న చికిత్స గురించి డాక్టర్లతో వాకబు చేశారు. దాదాపు అరగంట సేపు అక్కడే ఉండి డాక్టర్లతో మాట్లాడారు. కాగా, పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా.. ఖర్చుకు వెనకాడకుండా

మిగతా 3వ పేజీలో..

హైడ్రా వ్యవహారంపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.
- న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.
- భూమాఫియాను వదిలేసి, పేదల ఇళ్లపైనే కూల్చివేతలు జరిగాయి.
- హైడ్రా చర్యల వల్ల అనేక కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింది.

2

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు షాక్

- కమిషనర్ పోస్టు నుంచి తొలగించాలని సీఎస్‌కు ఆదేశం
- 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహం
- కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించడం సరికాదన్న ధర్మాసనం
- రంగనాథ్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని సూచన
- తదుపరి విచారణకు రంగనాథ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించి, స్థానంలో మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్)ను హైకోర్టు ఆదేశించింది. రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించడం

మిగతా 2లో..

సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు

- సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసింది: కిషన్ రెడ్డి
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని వ్యాఖ్య
- నాలుగు రాష్ట్రాలు, ఎన్‌టీపీసీకి సింగరేణి నుంచి బొగ్గు సరఫరా
- బీఆర్ఎస్ హయాంలో సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పరిస్థితి మెరుగుపడలేదని విమర్శ
- సింగరేణిలో కేంద్రానికి 49%, రాష్ట్రానికి 51%వాటా ఉందన్న కేంద్రమంత్రి

3

- రాజకీయాల కోసం సింగరేణిని వాడుకున్నారని కేసీఆర్‌పై మండిపాటు

రోడ్డుపై OMR షీట్ల కలకలం..

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

హైదరాబాద్ రోడ్డుపై ఓఎంఆర్ (OMR) జవాబు పత్రాలు కనిపించిన వ్యవహారం తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) స్పందించింది. ఈ ఘటనపై స్పష్టతనిస్తూ అధికారిక వివరణ విడుదల చేసింది. బాధ్యులైన ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లను తక్షణమే సస్పెన్షన్ చేయడంతో పాటు ఓఎంఆర్ షీట్ల తరలింపులో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్‌ను రద్దు చేసి, అతనిపై ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

2018 నాటి పాత ఓఎంఆర్ షీట్లే

రోడ్డుపై ప్రత్యక్షమైన ఓఎంఆర్ షీట్లు 2018లో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ నియామక పరీక్షకు సంబంధించినవని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఈ పరీక్షలకు సంబంధించిన తుది ఫలితాలను ఇప్పటికే 2020లోనే విజయవంతంగా ప్రకటించామని తెలిపింది. కమిషన్ రికార్డుల నిర్వహణ నిబంధనల ప్రకారం నిర్ణీత కాల పరిమితి పూర్తయినందున, వీటిని ధ్వంసం (Shredding) చేయడానికి గుర్తించినట్లు వెల్లడించింది. అయితే ఆ రికార్డుల ధ్వంస ప్రక్రియ కోసం అధీకృత కాంట్రాక్టర్‌కు అప్పగించిన సమయంలో ఊహించని విధంగా కొన్ని ఓఎంఆర్ షీట్లు రోడ్డుపై పడిపోయినట్లు పేర్కొంది.

అధికారులపై వేటు,

కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేస్

ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ ముమ్మరంగా కొనసాగుతోందని కమిషన్ తెలిపింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించిన నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, తీవ్ర పరిణామాలను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లను తక్షణమే సస్పెండ్ చేసినట్లు కమిషన్ వెల్లడించింది. మరోవైపు ఓఎంఆర్ షీట్ల సురక్షిత తరలింపు , నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకున్నారు. అతనికి ఇచ్చిన వర్క్ ఆర్డర్‌ను వెంటనే రద్దు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు.

భవిష్యత్ పరీక్షలపై ఎలాంటి ప్రభావం ఉండదు

గతంలో పూర్తయిన పరీక్షల పాత రికార్డులు మాత్రమే కావడం వల్ల ఈ ఘటనతో రాబోయే లేదా ప్రస్తుతం జరుగుతున్న ఎలాంటి భవిష్యత్ నియామక ప్రక్రియలపై ప్రభావం ఉండదని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. కమిషన్ పరిధిలోని రికార్డుల నిర్వహణ, వాటిని భద్రపరచడం ప్రక్రియల్లో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా మునుపెన్నడూ లేని విధంగా అత్యంత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసన

- **పార్లమెంట్‌లో విపక్షాల ఆందోళన**
- **కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాల నిరసన**
- **విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎంపీలు**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:

జులై 20న నిర్వహించిన 'సంసద్ మార్చ్' సందర్భంగా విద్యార్థులపై పోలీసులు దాడికి పాల్పడ్డారనే ఆరోపణలపై కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు పార్లమెంట్‌లో నిరసన చేపట్టాయి. విద్యార్థులపై జరిగిన పోలీసు దౌర్జన్యాన్ని ఖండిస్తూ, ఘటనకు బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టిన విపక్ష ఎంపీలు, విద్యార్థులపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి..

- **తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక**
- **కాస్పియన్ సముద్రంలో ఇరాన్ వాణిజ్య నౌకపై దాడి**
- **ఒక నావికుడు మృతి.. మరొకరికి గాయాలు**
- **ఉక్రెయిన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిక**
- **కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలకు ఇరాన్ డిమాండ్**
- **రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో తమకు సంబంధం లేదన్న టెహ్రాన్**
- **కీవ్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్ల దాడి.. ఆరుగురు మృతి**

ఇరాన్, ఆశ్వి అప్డేట్స్:

కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ దాడి జరిపిందని ఇరాన్ ఆరోపించింది. ఈ ఘటనలో ఓ నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు తెలిపింది. ఈ దాడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన టెహ్రాన్.. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ ఘటనకు కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

యుద్ధం మరింత విస్తరించకుండా చూడాలంటే ఉక్రెయిన్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ కోరింది. పశ్చిమాసియాలో ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యాఉక్రెయిన్ యుద్ధంలో తమకు ఎలాంటి పాత్ర లేదని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది.

అయితే, రష్యా నుంచి ఇరాన్‌కు ఉపగ్రహ సమాచార సహకారం అందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ ఆరోపించారు. గల్ఫ్ దేశాలు, అమెరికా సైనిక స్థావరాలకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను రష్యా సేకరించి ఇరాన్‌కు అందిస్తోందని, వాటిని ఇరాన్ తన సైనిక చర్యల్లో వినియోగిస్తోందని పేర్కొన్నారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో కాస్పియన్ సముద్ర మార్గం ఇరాన్‌కు అత్యంత కీలకంగా మారింది. ఉత్తర దిశలోని ఈ మార్గం ద్వారానే చైనా సహా పలు దేశాల నుంచి వస్తువులు ఇరాన్‌కు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ వాణిజ్య నౌకపై జరిగిన దాడి వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది.

మరోవైపు, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి భారీ దాడికి దిగింది. ఆదివారం తెల్లవారుజామున ఏడు బాలిస్టిక్ క్షిపణులు, 136 డ్రోన్లతో దాడులు జరిపినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. కీవ్‌తో పాటు చెర్నిహివ్, ఖార్కివ్ తదితర నగరాలు కూడా లక్ష్యంగా మారాయి. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు..

తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

హైడ్రా వ్యవహారంపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

మల్కాజిగిరి , ఆశ్వి అప్డేట్స్:

హైడ్రా వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. కోర్టు ఆదేశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా ఏర్పాటుతో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు ఆక్రమణల నుంచి రక్షణ పొందుతాయని ప్రజలు ఆశించారని, కానీ భూమాఫియాపై చర్యలు తీసుకోకుండా పేదల ఇళ్లపైనే కూల్చివేతలు జరిగాయని ఆరోపించారు. హైడ్రా చర్యల కారణంగా అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రియల్ ఎస్టేట్ రంగం కూడా తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు కాకుండా చట్టానికి లోబడి విధులు నిర్వహించాలని సూచించిన ఈటల రాజేందర్, హైకోర్టు తీర్పు అనంతరం ప్రభుత్వం తన విధానాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

భారీ వర్షాల హెచ్చరిక

- **ఐటీ కంపెనీలకు సైబరాబాద్ పోలీసుల కీలక సూచనలు**
- **సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**
- **పీక్ అవర్స్‌లో తీవ్ర ట్రాఫిక్ రద్దీపై హెచ్చరిక**
- **దశల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని ఐటీ సంస్థలకు విజ్ఞప్తి**
- **ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు సహకరించాలని సూచన**
- **ముందస్తు లాగౌట్ సమయాలను పోలీసులకు తెలియజేయాలని ఆదేశం**
- **ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేసిన సైబరాబాద్ పోలీసులు**

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

నగరంలో మంగళవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. వర్షాల కారణంగా సాయంత్రం పీక్ అవర్స్‌లో ప్రధాన రహదారులు, జంక్షన్‌ల వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశముందని హెచ్చరించారు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఐటీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు, ఇతర కార్యాలయాలు తమ ఉద్యోగులకు దశల వారీగా ముందస్తు లాగౌట్ కల్పించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రోడ్లపైకి రావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రతతో పాటు ట్రాఫిక్ నిర్వహణను సమర్థంగా చేపట్టేందుకు సంస్థలు పోలీసులకు సహకరించాలని కోరారు. ముందస్తు లాగౌట్ అమలు చేసే సంస్థలు తమ కార్యాలయాల లొకేషన్, ఉద్యోగులను విడుదల చేసే సమయాలను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అలాగే రహదారులపై నీటి నిల్వలు, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు షాక్

మొదటిపేజీ తరువాయి

ఉన్నతాధికారికి తగదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట సర్వే నంబర్లు 1, 2లోని భూములకు సంబంధించిన వ్యవహారంలో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హైడ్రా అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ శాంతా శ్రీరాం కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు స్టే ఉన్నప్పటికీ హైడ్రా సిబ్బంది భూమి ఫెన్సింగ్‌ను తొలగించారని సంస్థ వాదించింది.

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఒకే కేసులో పలుమార్లు కోర్టు ఆదేశాలను ధిక్కరించడం తీవ్ర విషయం అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టును ఆశ్రయించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని స్పష్టం చేసిన ధర్మాసనం, కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా వ్యవహరించడం చట్ట పరిపాలనకు విరుద్ధమని పేర్కొంది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణకు రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు. ఆ అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరుతూ, కోర్టుల పట్ల తనకు పూర్తి గౌరవం, నమ్మకం ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే లోతుకుంటలోని 40 ఎకరాల భూమిలోకి తాము ప్రవేశించలేదని వివరణ ఇచ్చారు. అయితే ఈ వివరణతో సంతృప్తి చెందని హైకోర్టు, రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు నమోదయ్యాయని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. కోర్టు ఆదేశాల అమలులో ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తూ, ఆయనను కమిషనర్ పదవి నుంచి తొలగించి కొత్త అధికారిని నియమించాలని సీఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

హైదరాబాద్ మెట్రోకు మేకోవర్..
10 స్టేషన్లతో కొత్త ప్లాన్.!

మొదటిపేజీ తరువాయి

బేగంపేట్ నుండి రాయదుర్గ్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పార్కింగ్, పారిశుధ్య నిర్వహణపై సమీక్ష

మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రాథమికంగా 10 స్టేషన్ల ఎంపిక ,

తదుపరి చర్యలు

మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షిత మైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

విద్యార్థులపై దాడులు ఆపాలి

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారనే వార్తలు వస్తున్నాయని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా విద్యార్థులపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే 47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణే కనిపిస్తోందని విమర్శించారు.

నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని తాను గతంలోనే చెప్పానని రాహుల్ అన్నారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడమే కాకుండా, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని ఆరోపించారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కేసులు నమోదు చేయడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం ప్రధాన్యం సంతరించుకుంది.

సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు

- సింగరేణిని బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసింది: కిషన్ రెడ్డి
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని వ్యాఖ్య
- నాలుగు రాష్ట్రాలు, ఎన్‌టీపీసీకి సింగరేణి నుంచి బొగ్గు సరఫరా
- బీఆర్ఎస్ హయాంలో సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పరిస్థితి మెరుగుపడలేదని విమర్శ
- సింగరేణిలో కేంద్రానికి 49%, రాష్ట్రానికి 51% వాటా ఉందన్న కేంద్రమంత్రి

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు, అలాగే ఎన్‌టీపీసీకి సింగరేణి నుంచి బొగ్గు సరఫరా అవుతోందని తెలిపారు. దేశ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి తీరని నష్టం జరిగిందని, సంస్థ ఆదాయానికి గండికొట్టారని ఆరోపించారు. సింగరేణిని అభివృద్ధి దిశగా నడిపించాల్సింది పోయి రాజకీయ వేదికగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సింగరేణి పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని కిషన్ రెడ్డి అన్నారు. సంస్థను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.సింగరేణి యాజమాన్య నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ, సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థ అభివృద్ధికి కేంద్రం తనవంతు సహకారం అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

శంకర్‌పల్లి–మర్పల్లి రహదారికి రూ.43 కోట్లు.. త్వరలో పనులు ప్రారంభం

శంకర్‌పల్లి, జూలై 27ఆశ్వి అప్డేట్స్:

శంకర్‌పల్లి-మర్పల్లి రహదారి అభివృద్ధి అంశంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చేకూర్తి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రహదారి అభివృద్ధి కోసం రూ.43 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రహదారిని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, కాశెట్టి చంద్రమోహన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి....

వలిగొండ,జులై 27ఆశ్వి అప్డేట్స్:

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వలిగొండ ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు వివిధ సమస్యలతో కూడిన

వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందించలేదని వెంటనే యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్నిప్రభుత్వ పాఠశాలల్లోసీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం డైరీలను అందించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించేందుకు నిధుల కేటాయింపు పెంచాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే మరొకవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను వెంటనే మానుకోవాలని ఇప్పటికే మండలంలో మూసివేసిన పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగిలి పాక గోపాల్, కొండే కిష్టయ్య, దుబ్బ లింగం,కవిడే సురేష్,భీమనబోయిన జంగాయ్య,వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల నాగరాజు,ధ్యానబోయిన యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

రోడ్డు లేక అడవిలోనే ప్రసవం..!

- చింతకుంట గర్భిణికి అంబులెన్స్‌లోనే డెలివరీ – 108 సిబ్బంది సమయస్ఫూర్తితో తల్లి, బిడ్డ సురక్షితం
- పాలకుల నిర్లక్ష్యంపై ఆదివాసీల ఆగ్రహం.."ఓట్లప్పుడు హామీలు.. తర్వాత మా గ్రామం మరచిపోతారు"

బూర్గంపాడు, జూలై 27 ఆశ్వి అప్డేట్స్:

అభివృద్ధి మాటల్లోనే మిగిలిపోతే,దాని మూల్యం సామాన్య ప్రజల ప్రాణాలతో చెల్లించాల్సి వస్తుందనడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని చింతకుంట గ్రామంలో చోటుచేసుకున్న ఘటన హృదయ విదారక ఉదాహరణగా నిలిచింది.గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో ఓ నిండు గర్భిణి ఆసుపత్రికి చేరుకోలేక అడవి మార్గంలోనే అంబులెన్స్‌లో ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.చింతకుంట గ్రామానికి చెందిన సోడి మార్త (30)కు సోమవారం ఉదయం ఒక్కసారిగా తీవ్ర పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి.కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ పైలట్ విజయభాస్కర్ అత్యంత కష్టతరమైన గుంతల రహదారిలోనూ చాకచక్యంగా గ్రామానికి చేరుకుని గర్భిణిని అంబులెన్స్‌లోకి తరలించారు.అయితే గ్రామం నుంచి బయటకు వచ్చే రహదారి పూర్తిగా శిథిలావస్థలో ఉండటంతో వాహనం తీవ్రంగా కుదుపులకు గురైంది.దీంతో గర్భిణికి నొప్పులు మరింత ఎక్కువయ్యాయి.పరిస్థితి విషమించడంతో ఆసుపత్రికి చేరుకునే అవకాశం లేకపోవడంతో సమీపంలోని అడవి ప్రాంతంలో అంబులెన్స్‌ను నిలిపివేశారు.అలాంటి క్లిష్ట సమయంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (EMT) రాధ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు.మార్త పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.అనంతరం తల్లి, బిడ్డలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.ఈ ఘటనతో చింతకుంట గ్రామ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. "ఎన్నికల సమయంలో నాయకులు హామీల వర్షం కురిపిస్తారు. గెలిచిన తర్వాత మా గ్రామానికి రోడ్డు కూడా వేయరు.గర్భిణీలు ప్రాణాల కోసం పోరాడాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు" అంటూ గ్రామస్థులు మండిపడ్డారు.ప్రాణాపాయ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి తల్లి, బిడ్డలను కాపాడిన 108 సిబ్బంది రాధ, విజయ భాస్కర్‌లను గ్రామస్థులు అభినందించారు.అదే సమయంలో చింతకుంట గ్రామానికి తక్షణమే అన్ని కాలాల్లో ప్రయాణించగల రహదారి నిర్మించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆదివాసీలు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై కేసీఆర్ ఆందోళన.. "మా నేతను కాపాడండి"

మొదటిపేజీ తరువాయి

పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, వారికి భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కేసీఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు. చివరగా "మీరేం చేస్తారో చేయండి.. కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు.

వర్షానికి చెరువులైన రోడ్లు.. బుల్కాపూర్ వాసుల అవస్థలు

శంకర్‌పల్లి, జూలై 27ఆశ్వి అప్డేట్స్:

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ 4వ వార్డులో రోడ్ల దుస్థితి స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారులపై భారీగా నీరు నిలిచి బురదమయంగా మారడంతో రాకపోకలు కష్టంగా మారాయి. పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. నిల్వ నీటి కారణంగా దోమలు, ఈగల ఉధృతి పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు. అలాగే వారానికి ఒకసారి దోమల మందు పిచికారీ, ఫాగింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ప్రజల తరఫున అడ్వకేట్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శేఖర్ మద్దూరి ప్రస్తావిస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన ఎస్ఐ కి సన్మానం...

శంషాబాద్ జూలై27 ఆశ్వి అప్డేట్స్:

శంషాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ ఫ్యూచర్ సిటీ రూరల్ పోలీస్ స్టేషన్ కి నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సీఐ సురేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, రాజు ముదిరాజ్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, బాలు ముదిరాజ్, రవి నాయక్, భిక్షపతి రెడ్డి, లక్ష్మీ లింగం, ఆంజనేయులు, గోపాల్ నాయక్, రాంగోపాల్, దేవేందర్, నరసింహా, ఇస్తారీ, చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ దవణాకర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, భిక్షపతి, రమేష్ యాదవ్, ఇంద్రారెడ్డి, దేవేందర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి....

వలిగొండ,జులై 27ఆశ్వి అప్డేట్స్:

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వలిగొండ ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందించలేదని వెంటనే యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్నిప్రభుత్వ పాఠశాలల్లోసీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం డైరీలను అందించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించేందుకు నిధుల కేటాయింపు పెంచాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే మరొకవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను వెంటనే మానుకోవాలని ఇప్పటికే మండలంలో మూసివేసిన పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగిలి పాక గోపాల్,కొండే కిష్టయ్య, దుబ్బ లింగం,కవిడే సురేష్,భీమనబోయిన జంగాయ్య,వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల నాగరాజు,ధ్యానబోయిన యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

ప్రైవేట్ రుణాల పేరుతో మోసాలపై

బాధితులకు న్యాయం చేస్తాం: అడ్వకేట్ జయభారత్

హైదరాబాద్ జులై 27ఆశ్వి అప్డేట్స్

బాధితుల ఆరోపణల మేరకు ప్రైవేట్ రుణాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురిని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లోళం శేఖర్ వ్యవహారంలో న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్నాయని అడ్వకేట్ జయభారత్ తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు బాధితులు తమ ఫిర్యాదులు అందజేశారని, మరెవరైనా ఇదే తరహా మోసానికి గురై ఉంటే తమను సంప్రదించాలని ఆయన కోరారు. బాధితులుగా ముందుకువచ్చినవారిలోలక్ష్మీనారాయణ రెడ్డి (ఆల్వాల్), బుర్ర కృష్ణారెడ్డి (స్టేషన్ ఘన్‌పూర్), తుమ్మ మోహన్ రెడ్డి (మెడ్చల్), తుమ్మ బాలశివ రెడ్డి (మెడ్చల్), జె. వీరనారాయణ రెడ్డి (విద్యానగర్), బంటు నాగేష్ (వనస్థలిపురం), షేక్ అక్బర్ (ఆల్వాల్) ఉన్నట్లు తెలిపారు.అలాగే ఈ వ్యవహారానికి సంబంధించి నల్గొండ, మేడిపల్లి, వనస్థలిపురం, వరంగల్, మెడ్చల్, ఆల్వాల్, భువనగిరి ప్రాంతాల్లో కేసులు నమోదు అయినట్లు బాధితులు పేర్కొంటున్నారని చెప్పారు. ఈ ఆరోపణలపై సంబంధిత దర్యాప్తు సంస్థలు విచారణ కొనసాగిస్తున్నాయి.ఇలాంటి మోసానికి గురైన ఇతర బాధితులు కూడా న్యాయ సహాయం కోసం అడ్వకేట్ జయభారత్ సంప్రదించాలన

నీళ్లను డబ్బులాగా పొదుపుగా ఖర్చు చేయాలి

- **నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**
- **పాలంలో నీటి కుంట, గ్రామంలో ఊట కుంటలు ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి**
- **జలసిరి కార్యక్రమం అవగాహన సదస్సులో ఎంపీడీవోలు జీ.విష్ణు, చందర్ నాయక్ ల పిలుపు**

కోటగిరి, జులై 27ఆశ్వి అప్డేట్స్:

నీళ్లను డబ్బులాగా పొదుపుగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని కోటగిరి, పోతంగల్ ఎంపీడీవోలు జి.విష్ణు, చందర్ నాయక్ అన్నారు.సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జలసిరి కార్యక్రమంపై ఎంపీడీవో అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు, చందర్ నాయక్ మాట్లాడుతూ....గ్రామాలలో జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మహిళా సంఘాల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.ప్రతి గ్రామంలో నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు ఊరికి ఊటకుంట, పొలానికి పంట కుంట, ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ లక్ష్యాల సాధనకు గ్రామ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు,మహిళా సంఘాలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.విష్ణు,పోతంగల్ మండల స్పెషల్ ఆఫీసర్ మున్ని నాయక్, కోటగిరి ఏపీఎం భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్, ఏపీవో గంగారం, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన జీ.పి.కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరుబయట మల విసర్జన చేస్తే రూ.5వేల జరిమానా

- **తిర్మలాపూర్ సర్పంచ్ బోయి సైదవ్వ**
- **తిర్మలాపూర్ గ్రామంలో సర్పంచ్ బోయి సైదవ్వ అధ్వర్యంలోశ్రమసభ**
- **పలు ముఖ్య తీర్మానాలను మోదించిన గ్రామ ప్రజలు**

కోటగిరి,జులై 27ఆశ్వి అప్డేట్స్:

పోతంగల్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో సర్పంచ్ బోయి సైదవ్వ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో భాగంగా మహిళల గ్రామసభ, బాలల గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో పలు ముఖ్య తీర్మానాలను ఆమోదించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి నల్లకు ఆన్ ఆఫ్ చేసే ట్యాప్ పెట్టుకోవాలని, నీరు వృధా చేస్తే రూ.5వేల జరిమానా విధించబడును అని గ్రామపంచాయతీ తీర్మానించడం జరిగింది. నీరు నిల్వ కోసం ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని
సోక్ పిట్, పంట కుంటలు నిర్మించాలని తీర్మానించారు. గ్రామంలో బాల్య వివాహాలు చేయరాదని ఒకవేళ బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని గ్రామ పంచాయతీ తీర్మానం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అలాకాకుండా ఆరు బయట మలవిసర్జన చేస్తే రూ.5 వేల రూ జరిమానా విధించబడుతుందని గ్రామపంచాయతీ తీర్మానం చేశారు. గ్రామంలో
డ్రగ్స్, గంజాయి ఎవరైనా అమ్మినా .. పట్టుబడినా .. పదివేల రూపాయల జరిమానా విధించబడుతుందని ఎవరైనా పట్టించిన పట్టించినా వారికి 10వేల రూపాయలు గ్రామపంచాయతీ నుండి రివార్డు ఇవ్వబడునని వారి పేరు గోప్యంగా ఉంచబడును గంజాయి తాగుతూ పట్టుపడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని, కిరాణా షాపుల్లో 21 సంవత్సరాలు నిండని వారికి సిగరెట్, గుట్కా వంటివి అమ్మ రాదని అమ్మినచో 5 వేల రూపాయల జరిమానా విధిస్తామని తీర్మానించారు.
కిరాణా షాపులో ఎక్సయిరీ అయిపోయిన వస్తువులు నమ్మితే రూ.5వేల జరిమానా విధించాలని గ్రామపంచాయతీ తీర్మానించింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయి సైదవ్వ, ఉప సర్పంచ్ సంజీవ్,
వార్డు సభ్యులు ఆస్మా బేగం, రమాబాయి, లక్ష్మీబాయి, లక్ష్మి, కాశయ్య... సీఏ అనుజ, ఫీల్డ్ అసిస్టెంట్ జైరాం, గ్రామస్తులు గంగాధర్, శంకర్ పటేల్, నాగేశ్వరరావు పటేల్, లింగయ్య, లాలయ్య, డ్వాక్రా సంఘాల మహిళలు, హన్మవ్వ, సుజాత,రుక్మవ్వ, నవిస, పోశవ్వ, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగవైకల్యంతో ఉన్న రాహుల్‌కు మరపురాని కానుక

- **రాహుల్‌కు పోలీస్ అధికారి అనుభూతి కల్పించిన సీపీ**

మేడ్చల్-మల్కాజిగిరి, జూలై 27ఆశ్వి అప్డేట్స్:

పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన రాహుల్ చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బాడుగుల సుమతి నెరవేర్చారు. ఒకరోజైనా పోలీస్ అధికారిగా కుర్చీలో కూర్చోవాలన్న రాహుల్ ఆకాంక్షను తెలుసుకున్న సీపీ, అతడిని కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించారు. తన అధికారిక కుర్చీలో రాహుల్‌ను కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేసి ఆప్యాయంగా అభినందించారు. "నీ కోరిక తీరిందా రాహుల్?" అని సీపీ అడగగా, ఆనందంతో చిరునవ్వులు చిందిస్తూ రాహుల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చిన తిరుమలరావు-రాధమ్మ దంపతుల కుమారుడైన రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితి, మాటలు కూడా సరిగా పలకలేని స్థితిలో ఉండటంతో కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.
రాహుల్ పరిస్థితిని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి వీల్‌చైర్‌ను అందజేశారు. అనంతరం రాహుల్ కోరికను సీపీ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన కమిషనర్ అతడి కలను నిజం చేశారు.ఈ సందర్భంగా సీపీ బాడుగుల సుమతి మాట్లాడుతూ.. అంగవైకల్యంతో బాధపడుతున్న వారిని సమాజం ఆదరించాలని, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు కూడా మరింత ముందుకు వచ్చి సేవలు అందించాలని సూచించారు. రాహుల్ కోరిక నెరవేరడంతో అతని తల్లిదండ్రులు సీపీ బాడుగుల సుమతి, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత, మెరుగు శివకృష్ణలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఓకే ఊరు.. మూడు మండలాలు..!

- **మూడు మండలాల మధ్య బోడగట్టు గ్రామం ఆగమాగం.!!**
- **టేక్మాల్ పరిధిలో రెవెన్యూ.. పాపన్నపేట పరిధిలో పోలీస్ స్టేషన్**
- **పెద్దశంకరంపేట పరిధిలో బ్యాంకు లావాదేవీలు**
- **ఒకే మండలానికి పరిమితం చేయాలని గ్రామస్తుల డిమాండ్**

టేక్మాల్, జూలై 27ఆశ్వి అప్డేట్స్:



రెవెన్యూ మెదక్.. నియోజకవర్గం సంగారెడ్డి

ఈ మూడు మండలాల పరిపాలనా పరమైన వైరుధ్యం స్థానిక ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. రెవెన్యూ జిల్లా - మెదక్: టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడు మండలాలు రెవెన్యూ పరంగా మెదక్ జిల్లా పరిధిలో ఉన్నాయి. భూ సమస్యలు, పాస్‌పుస్తకాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు మరియు కలెక్టరేట్ పనుల కోసం ఈ గ్రామాల ప్రజలు సుదూరంలో ఉన్న మెదక్ జిల్లా కేంద్రానికి ప్రయాణించాల్సి వస్తోంది.
శాసనసభ నియోజకవర్గం - సంగారెడ్డి జిల్లా: రాజకీయంగా మరియు శాసనసభ నియోజకవర్గ పరిధి విషయానికి వస్తే, ఈ మూడు మండలాలు సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. దీంతో అభివృద్ధి నిధులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేను, అధికారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

అభివృద్ధికి అడ్డుకట్ట – రెండు జిల్లాల మధ్య సమన్వయ లోపం

ఒకే ప్రాంతం రెండు వేర్వేరు జిల్లాల పరిధిలో ఉండటం వల్ల అధికారుల మధ్య తీవ్రమైన సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మెదక్ జిల్లా కలెక్టరేట్ నుండి వచ్చే అధికారిక ఉత్తర్వులు, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమన్వయం మధ్య నిరంతరం జాప్యం జరుగుతుండటంతో సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన నిలిచిపోతోంది.
అటు మెదక్ జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటం, ఇటు రెవెన్యూ యంత్రాంగం సంగారెడ్డి జిల్లాతో కలవకపోవడంతో ఈ మూడు మండలాలు అభివృద్ధిలో నిరంతరం వెనుకబడిపోతున్నాయి. అత్యవసర పనుల కోసం సామాన్య ప్రజలు మెదక్, సంగారెడ్డి రెండు జిల్లాల చుట్టూ తిరగలేక వేసారిపోతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్

రిపాలనా సౌలభ్యం అనే పదాన్ని నిజం చేయాలంటే, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడు మండలాలను మెదక్ రెవెన్యూ జిల్లా నుండి పూర్తిగా తప్పించి సంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు గళమెత్తుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం మరియు నియోజకవర్గ పాలనా కేంద్రం ఒకే జిల్లా (సంగారెడ్డి) పరిధిలోకి వస్తేనే ప్రభుత్వ సేవలు వేగవంతమవుతాయని స్పష్టం చేస్తున్నారు.

టేక్మాల్,అల్లాదుర్గ్,రేగోడ్

మంత్రి దామోదర రాజనర్సింహా చొరవపైనే ఆశలు

ఆందోల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న డాక్టర్ సి. దామోదర్ రాజనర్సింహా (మినిస్టర్ దామోదర్ రాజ నరసింహ) ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కష్టాలను ప్రత్యేకంగా గుర్తించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పాలనాపరమైన ఈ చిక్కులను పరిష్కరించి, మూడు మండలాలను వెంటనే సంగారెడ్డి జిల్లాలో విలీనం చేసేలా ప్రభుత్వంపై

ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం

- **అర్హులందరి పేర్లు తుది జాబితాలో ఉండేలా కృషి చేయాలి**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**
- **వనపర్తి పట్టణంలో సుడిగాలి పర్యటన**
- **'సర్' ప్రక్రియను పరిశీలించి బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు పలు సూచనలు**

వనపర్తి, జూలై 27 ఆశ్వి అప్డేట్స్:

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా సోమవారం వనపర్తి పట్టణంలోని పలు బూత్‌లను సందర్శించి జరుగుతున్న పనితీరును ఆయన పరిశీలించారు.
ఈ సందర్భంగా 15వ వార్డుతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బీఎల్‌వోలు, బీఆర్ఎస్ బీఎల్ఏలు, పార్టీ నాయకులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సర్ ప్రక్రియకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేసి ప్రతి అర్హుడి పేరు తుది జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
వనపర్తి పట్టణంలో ప్రస్తుతం 63,246 మంది ఓటర్లు నమోదై ఉన్నారని, అందులో గ్రామాలకు మారిన వారి పేర్లను నిబంధనల ప్రకారం సవరించి, వాస్తవ ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసి శతం పందకు చేరేలా కృషి చేయాలని సూచించారు. పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ నిర్వహించి వనపర్తిని ఆదర్శ పట్టణంగా నిలపాలని ఆకాంక్షించారు.సుడిగాలి పర్యటనలో భాగంగా ప్రతి బూత్‌లో చురుకుగా పనిచేస్తున్న బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, బీఆర్ఎస్ కార్యకర్తలను అభినందించారు. అనంతరం కౌన్సిలర్ భారతి -ప్రేమ్‌నాథ్ రెడ్డి నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమై వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, బీఎల్‌ఏలు అభిషేక్, సురేందర్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు బండారు కృష్ణ, ఉంగ్లం తిరుమల్, బండారు భరత్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, మురళీ సాగర్, కాగితాల లక్ష్మీనారాయణ, దేవర్ల నరసింహ, బాబు నాయక్, గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్, నీలస్వామి, వెంకట్ సాగర్, సూర్యవంశం గిరి, జానంపేట శ్రీనివాసులు, జోహెబ్ హుస్సేన్, సయ్యద్ జమీల్, చిట్యాల రాము, అరీఫ్, పాషా, మెకానిక్ శ్రీను, యుగంధర్ రెడ్డి, శిరీవాటి శంకర్, లక్ష్మణ్ గౌడ్ బ్రదర్స్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగుతున్న జోగినాథ గుట్ట

- **భక్తుల కొంగుబంగారంగా జోడు లింగాల శ్రీ జోగినాథ స్వామి..**
- **ప్రత్యేక ఆకర్షణగా గిరి ప్రదక్షిణ**

జోగిపేట, జూలై 27 ఆశ్వి అప్డేట్స్:

అందోల్ నియోజకవర్గ కేంద్రం జోగిపేటలో 1640లో వెలసిన అతి పురాతన జోడు లింగాల శ్రీ జోగినాథ స్వామి ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా రోజురోజుకూ విశేష ఆదరణ పొందుతోంది. శివభక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయానికి ప్రతి సోమవారం వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

విశిష్ట అలంకరణలో జోగినాథుడు

ప్రతి సోమవారం జోడు లింగాల శ్రీ జోగినాథ స్వామిని పుష్పాలు, రుద్రాక్షలు, బిల్వదళాలు, వివిధ రకాల పూజా సామగ్రితో శోభాయమానంగా అలంకరిస్తారు. అభిషేకాలు, రుద్రపారాయణం, అర్చనలు, మహామంగళహారతులతో ఆలయం శివనామస్మరణతో మార్మోగిపోతుంది. స్వామివారి దివ్య దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుంటారు.
జోగిపేట పట్టణ ప్రజలతో పాటు సమీప మండలాల పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం, ఉద్యోగాల కోసం, రైతులు పంటలు బాగా పండాలని, కుటుంబాలు ఆయురారోగ్యాలు, సుఖశాంతుల కోసం ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా గిరి ప్రదక్షిణ

ఇటీవల జోగినాథ గుట్టపై ప్రారంభించిన గిరి ప్రదక్షిణ భక్తుల విశేష ఆదరణ పొందుతోంది. భక్తులు "ఓం నమః శివాయ" నామస్మరణతో గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. గిరి ప్రదక్షిణతో ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని, కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ప్రతి సోమవారం గిరి ప్రదక్షిణలో పాల్గొనే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

శ్రావణమాసంలో మరింత వైభవం

వచ్చేది శ్రావణ మాసం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, శివనామ సంకీర్తనలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి, ఉగాది, కార్తీకమాసం వంటి పర్వదినాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చే ఈ క్షేత్రం, శ్రావణ సోమవారాల్లో కూడా భక్తులతో కిటకిటలాడుతోంది.

ఆధ్యాత్మిక కేంద్రంగా జోగినాథ క్షేత్రం

జోగిపేటకు ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచిన జోడు లింగాల శ్రీ జోగినాథ స్వామి ఆలయం భక్తుల విశ్వాసాన్ని చూరగొంటోంది. కోరికలు తీర్చే దైవంగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, మనశ్శాంతి కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. గిరి ప్రదక్షిణ ప్రారంభం కావడంతో

పీహెచ్‌సీలో సమస్యలే సమస్యలు.. రోగుల ఆందోళన

- **శిథిలావస్థలో జమ్మిగడ్డ ఆరోగ్య కేంద్రం**

కాప్రా, జూలై 27ఆశ్వి అప్డేట్స్:



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధి డా. ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో ఉన్న జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దయనీయ స్థితిలో ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడం, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడం, తాగునీటి వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో గర్భిణీలకు నిర్వహించే స్కానింగ్ సేవలకు ఉపయోగించే ప్రింటర్ చాలాకాలంగా పనిచేయకపోవడంతో స్కాన్ నివేదికలు వెంటనే అందడం లేదని ఆరోపించారు. దీంతో గర్భిణీలు పలుమార్లు ఆసుపత్రికి రావాల్సి వస్తోందని, అనవసరంగా సమయం, డబ్బు వృథా అవుతోందని వాపోయారు. ఆసుపత్రి భవనంలో పలు చోట్ల పగుళ్లు ఏర్పడగా, వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతోందని స్థానికులు తెలిపారు. టాయిలెట్లు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. రోజూ వందలాది మంది పేద ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రంపై ఆధారపడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని, స్కానింగ్ ప్రింటర్‌ను వెంటనే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్లను పునరుద్ధరించి పరిశుభ్రంగా నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోగులకు గౌరవప్రదమైన, సురక్షితమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీ మత్స్యగిరి దేవస్థానం ఆవరణలో వరుణ యాగం

- **నిర్వహణ అధికారి వెంకటయ్య**

వలిగొండ, జూలై 27ఆశ్వి అప్డేట్స్

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సోమవారం రోజునకార్య నిర్వహణ అధికారి కే వెంకటయ్య ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించి వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా ప్రజలంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పురోహితులు దేవస్థానం సిబ్బంది భక్తులు తదితరులు

ఇంటి గుమ్మంలో స్నాచింగ్... వీధిలోనే దొంగకు ముగింపు!

- **చైన్ స్నాచర్‌కు కాలనీ కౌంటర్...పరారీలోనే పట్టివేత!**
- **సీసీ కెమెరా సాక్షిగా... స్నాచర్ ఆటకట్టు!**

కుత్బుల్లాపూర్, జూలై 27 ఆశ్వి అప్డేట్స్

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. సుచిత్ర సెంటర్ సమీపంలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో నివాసముంటున్న వెంకాయమ్మ (80) అనే మహిళ ఇంట్లో ఉండగా, ఓ దుండగుడు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని పరారయ్యేందుకు యత్నించాడు.

అయితే బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో అప్రమత్తమైన కాలనీవాసులు వెంటనే దుండగుడిని వెంబడించారు. కొద్ది దూరంలో అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి అనంతరం పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

ఈ ఘటనకు సంబంధించిన దుండగుడి పరుగు దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరా

ల్లో నమోదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

దుండగుడు గతంలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడ్డాడా? ఒంటరిగా వచ్చాడా? లేక మరెవరైనా సహచరులు ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనతో రాఘవేంద్ర కాలనీలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు కాలనీల్లో పోలీసు గస్తీ మరింత పెంచాలని కోరుతున్నారు.

నూతన సీఐ సురేందర్ రెడ్డి, కి ఘన సన్మానం..

శంషాబాద్ జులై27 ఆశ్వి అప్డేట్స్:

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ పెద్ద షాపూర్ రూరల్ పోలీస్ స్టేషన్ కు ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ సురేందర్ రెడ్డి ని సోమవారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు కనకమామిడి విష్ణు, బుర్కుంట నాగేష్, కర్రె అఖిల గణేష్, గూడెపు నీరజ లక్ష్మణ్, లింగం సంధ్య నవీన్, పులిమామిడి శాలిని శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మహబూబ్‌నగర్, జూలై 27ఆశ్వి అప్డేట్స్:

దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గంతో పాటు రాష్ట్రం నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పరమశివుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాసేవను మరింత సమర్థంగా నిర్వహించేలా తమకు శక్తి ప్రసాదించాలని మల్లన్నను వేడుకున్నట్లు పేర్కొన్నారు.

ఫాక్స్ సాగర్‌ను పీల్చేస్తున్న 'నీటి మాఫియా'..!

- **అధికారులు నీటిని కాపాడుతారా...లేక నీటి మాఫియాను కాపాడుతారా?**
- **చెరువు చుట్టూ బోర్లు... భవిష్యత్‌పై గోతులు..!**
- **ఫాక్స్ సాగర్ గుండెల్లో బోర్లు...ప్రజల గొంతులో దాహం!**

కుత్బుల్లాపూర్, జూలై 27ఆశ్వి అప్డేట్స్

ఒకవైపు వర్షాలు లేక కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోతుండగా, మరోవైపు ఫాక్స్ సాగర్ సరస్సు పరిసర ప్రాంతాల్లో సాగుతున్న అక్రమ నీటి వ్యాపారం జల వనరులనే మింగేస్తోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రజలు ఒక్క బిందె నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, అదే నీరు ట్యాంకర్ల రూపంలో ప్రతిరోజూ లక్షల రూపాయల వ్యాపారంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

హైదరాబాద్ నగర చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఫాక్స్ సాగర్ సరస్సు ఒకప్పుడు వేల ఎకరాల భూములకు జీవనాధారంగా నిలిచింది. నిజాం కాలంలో నిర్మించిన ఈ జలాశయం నేడు ఆక్రమణలు, విచ్చలవిడిగా బోర్లు, నిర్లక్ష్యంతో తన ఉనికినే కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. చెరువుకు చేరాల్సిన భూగర్భ జలాలు బోర్ల ద్వారా వెలికితీసి ప్రైవేట్ ట్యాంకర్లలో నింపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

దూలపల్లి పారిశ్రామికవాడ, సుభాష్‌నగర్, కొంపల్లి, జీడిమెట్ల పరిసరాల్లో ఫాక్స్ సాగర్ చుట్టూ అనుమతులకు విరుద్ధంగా అనేక బోర్లు తవ్వి రోజుకు 50 నుంచి 100 వరకు ట్యాంకర్ల ద్వారా కంపెనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 10 వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ.1,500, 20 వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వేసవి కాలం వచ్చినప్పుడల్లా ఈ వ్యాపారం మరింత విస్తరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదంలో ఫాక్స్ సాగర్ భవిష్యత్

చెరువు పరిసరాల్లో భూగర్భ జలాలను నియంత్రణ లేకుండా వెలికితీయడం వల్ల నీటి మట్టం క్రమంగా దిగజారుతోంది. ఫలితంగా సమీప కాలనీల్లో బోర్లు ఎండిపోవడం, కొత్త బోర్లు వేసినా నీరు అందకపోవడం, అపార్ట్‌మెంట్‌లలో తాగునీటి కొరత పెరగడం వంటి సమస్యలు ఉధృతమవుతున్నాయి. పర్యావరణ సమతుల్యతకు కూడా ఇది తీవ్రమైన ముప్పుగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారుల మౌనం ఎందుకు..?

ఫాక్స్ సాగర్ చుట్టూ బోర్లు ఎవరు వేశారు? ఎన్ని అనుమతులు ఉన్నాయి? భూగర్భ జలాల వినియోగంపై ఎలాంటి పర్యవేక్షణ జరుగుతోంది? అనే

ప్రశ్నలకు సమాధానం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. రెవెన్యూ, భూగర్భ జలాల శాఖ, ఇరిగేషన్, స్థానిక సంస్థలు పరస్పర సమన్వయంతో అక్రమ బోర్లను గుర్తించి మూసివేయాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు లేకపోతే నీటి సంక్షోభం తప్పదు

ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నీటి దోపిడీని అరికట్టకపోతే ఫాక్స్ సాగర్ పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడాలంటే ఇప్పుడే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ బోర్లపై ప్రత్యేక దాడులు, ట్యాంకర్ నీటి వ్యాపారంపై సమగ్ర విచారణ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని

ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న సబితా గోవర్ధన్ రెడ్డి

- **గ్రామాభివృద్ధికి గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ సత్కారం**

షాబాద్, జూలై 27ఆశ్వి అప్డేట్స్:

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, మల్లారెడ్డిగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సబితా గోవర్ధన్ రెడ్డి ఈ అవార్డును నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం అందుకున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ పాల్గొని సబితా గోవర్ధన్ రెడ్డిని అభినందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మలి రమేష్, మల్లారెడ్డిగూడ గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరి వద్దు...ఆరుతడి పంటలే ముద్దు..

- **సుందరగిరి రైతు వేదికలో విత్తన మేళా...**
- **ఎల్ నినో ప్రభావం కారణంగా రైతులకు పలు సూచనలు**
- **నాణ్యమైన విత్తనాల పంపిణీ**

చిగురుమామిడి, జూలై 27 ఆశ్వి అప్డేట్స్ :

మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి ఆధ్వర్యంలో సుందరగిరి రైతు వేదికలో 'రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,సర్పంచ్ జంగా శిరీష రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాబట్టి రైతులు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించుకోవాలని సూచించారు.తక్కువ నీటితో,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు.రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలను తీసుకు రావడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. రమణారెడ్డి మాట్లాడుతూ పెసర్లు,కందులు, మొక్కజొన్న విత్తనాలు 50శాతం రాయితీపై రైతులకు అందించాలని కోరారు.వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ,మేలైన విత్తన రకాలతో అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్,వ్యవసాయ శాఖ సిబ్బంది,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అన్నెపు నీలమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం...

శంషాబాద్ జులై27 ఆశ్వి అప్డేట్స్:

సాయి రక్ష కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నెపు ప్రభు ముదిరాజ్ తల్లి వర్ధంతి సందర్భంగా నేటికీ స్వర్గస్తులై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం శంషాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పేదలకు, కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నర్రగిరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి రాచమల్ల యాదగిరి ఇండిగో ఎయిర్లైన్స్ మేనేజర్ అరుణ్ ముదిరాజు, సుదర్శన్, గిలక రాజు, అలాగే సాయి రక్షా కన్స్ట్రక్షన్స్ కార్మికులు సతీష్ ముదిరాజ్, లింగం యాదవ్, రాజు గౌడ్, మల్లేష్ మరియు స్నేహితులు విజయ్, శ్రీనివాస్ చారి, దేవేందర్, శైలేందర్, మల్లేష్, రవి, సురేందర్, రాజు యాదవ్, ఉదయ్ కుమార్, కుంభోజు ప్రవీణ్ మరియు బంధుమిత్రులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

శంషాబాద్ జులై 27ఆశ్వి అప్డేట్స్:

శంషాబాద్ మండల కార్యాలయంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మరియు మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో తాసిల్దార్ రామలింగం గౌడ్, ఎంపీడీవో మున్ని, ఎంపీ ఓ రమేష్, వ్యవసాయ అధికారి శ్వేత, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు విస్తృతంగా పాల్గొన్నారు.

కలాం ఆశయాలే యువతకు మార్గదర్శకం: కేఎల్ఆర్

మహేశ్వరం, జూలై 27 ఆశ్వి అప్డేట్స్:

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి సందర్భంగా లీడ్ ఇండియా అధినేత కిచ్చెన్న లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ఘన నివాళులర్పించారు. కలాం దేశ యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని, గొప్ప కలలు కని వాటి సాధన కోసం కృషి చేయాలని ఆయన ఇచ్చిన సందేశం నేటికీ మార్గదర్శకంగా ఉందన్నారు.

కష్టం, చదువు, జ్ఞానం, మంచి నడవడికతోనే లక్ష్యాలను చేరుకోవచ్చని కలాం బోధించారని గుర్తుచేశారు. వైఫల్యాలే విజయానికి నాంది పలుకుతాయని చెప్పి లక్షలాది మంది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపిన అపూర్వ మేధావిగా కలాం చిరస్థాయిగా నిలిచిపోతారని కేఎల్ఆర్ కొనియాడారు.

నడకతో ఆరోగ్యం.. నడకతో ఆయుష్షు ..

వాకింగ్ అత్యుత్తమైన ఆరోగ్య అలవాటు. పైసా ఖర్చు లేకుండా మన శరీరాన్ని బాగు చేసుకొనే ప్రక్రియ. క్రమం తప్పకుండా నడిస్తే రోగాలు దరి చేరవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాకింగ్ వల్ల లాభాలేంటి? అసలు వాకింగ్ ఏ సమయంలో చేయాలి? ఎలా చేయాలి? అన్న విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. నడక వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ.

డిప్రెషన్ దూరమవుతుంది..!

నడక వల్ల డిప్రెషన్ దూరమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నడక వల్ల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గే ముప్పు తగ్గుందంటున్నారు. వేగంగా నడవడం వల్ల గుండెకు, శ్వాస వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుంది. ఆంగ్జయిటీ లేదా డిప్రెషన్‌తో బాధపడేవారికి నడక మరింత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నడవడం వల్ల శరీరంలోని ఎముకలు పటిష్టంగా మారతాయి. ఎముకలు పెళుసుగా మారడాన్ని నడకతో నివారించవచ్చు. రోజూ నడిస్తే శరీరంలోని కండరాలు బలంగా మారతాయి. నడక శరీరాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. శరీరానికి సరైన ఆకృతిని అందిస్తుంది. కండరాలను ఆరోగ్యంగా మార్చుతుంది. బరువు తగ్గించుకోవడానికి నడక ఒక మంచి మార్గం. నడక వల్ల శక్తి ఖర్చు అవుతుంది. ఫలితంగా బరువు తగ్గవచ్చు. నడక వల్ల శరీరంలో చక్కెర స్థాయిలో అదుపులో ఉంటాయని అనేక అధ్యయనాల్లో తేలింది. నడక వల్ల కొవ్వు పేరుకోదు. గుండె జబ్బులు, డయాబెటిస్, కాలేయ వ్యాధులకు కొవ్వు పేరుకుపోవడమే కారణం. ఇన్సులిన్‌కు శరీరం స్పందించే తీరును కూడా నడక మెరుగుపరుస్తుంది.

ఆయుష్షు ను పెంచుతుంది

నడక, ఆయుష్షును పెంచుతుంది. నడక వల్ల 1620 సంవత్సరాలు అదనంగా జీవించవచ్చు. ఎంత ఎక్కువగా నడిస్తే, మరణాన్ని అంత దూరంగా తరిమేయవచ్చు. నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. డిప్రెషన్ విషయంలో నడక అనేది ఒక యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. రోజూ వాకింగ్ చేయడం వల్ల క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక స్థితి కూడా బాగుంటుంది. బహిరంగ ప్రదేశాల్లో నడవడం వల్ల శరీరంలో విటమిన్ 'డి' స్థాయిలు పెరుగుతాయి. శరీరానికి సూర్యరశ్మి తగలడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

ఎలా నడవాలి?

తొలుత నెమ్మదిగా నడకను మొదలుపెట్టి క్రమ క్రమంగా వేగాన్ని పెంచాలి. గంటకు 6.4 కి.మీ వేగంతో రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఏదైనా వాకింగ్ గ్రూపులో చేరితే రోజూ నడవాలనే ఉత్సాహం కూడా వస్తుంది. ఒక్కసారి మీరు నడవాలని నిర్ణయించుకున్న తర్వాత అది మీ జీవితంలో భాగంగా మారుతుంది. ఇటీవలి కొన్ని పరిశోధనల ప్రకారం, మహిళలైతే ఉదయం 8 గంటల నుంచి 11 గంటల మధ్య నడిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అన్నింటికంటే రోజంతా చురుగ్గా ఉండటానికి నడక మంచి మార్గం. నడక ఉత్సాహంగా ఉంచుతుంది

ఏ వయసు వారు ప్రారంభించాలి..!

వాకింగ్ ను ఎవరైనా.. ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు. 45 ఏళ్లు దాటినవారు..నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు ముందుగా డాక్టర్‌ను కన్సల్ట్ అయ్యి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే డయాబెటిక్ టైప్ 1 ఉన్న వారు డాక్టర్ సూచన మేరకే వాకింగ్, వర్కవుట్స్ చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే అవకాశముంది.డయాబెటిక్ టైప్ 2 ఉన్న వారు అందిరిలాగే వాకింగ్ చేయొచ్చు. ముందుజాగ్రత్తగా గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.

ఈ పరిస్థితుల్లో నడవొద్దు..!

ఫుల్లుగా తిని వాకింగ్ చేయడం మంచిది కాదు. రెండు మూడ్రోజులు బ్రేక్ ఇచ్చి నడవడం కంటే డైలీ వాకింగ్ చేస్తేనే ప్రయోజనం. వాకింగ్ ఆపేసిన మళ్లీ ప్రారంభించాలంటే నెమ్మదిగా స్టార్ట్ చేయాలి. డైలీ అరంగట వాకింగ్ కు బ్రేమ్ కేటాయించాలిత క్కువ దూరంతో వాకింగ్ స్టార్ట్ చేసి రోజురోజుకు పెంచుకుంటూ వెళ్లాలి.

చన్నీటి స్నానం మంచిదేనా?

చన్నీటితో స్నానం చేయాలా? వేడి నీటితో స్నానం చేయాలా? గోరువెచ్చటి నీటితో స్నానం చేస్తే బెటరా? చాలా మందిని ఈ సమస్యలు వేదిస్తుంటాయి. చలికాలం ఎలాగూ తప్పదు కాబట్టి చాలా మంది హాట్ వాటర్ తోనే స్నానం చేస్తారు. అయితే కొంతమంది కాలాలకు అతీతంగా ప్రతి సీజన్ లోనూ వేడినీటితోనే స్నాం చేస్తారు. అసలు నీటితో స్నానం మంచిది.. నిపుణులు ఏం చెప్తున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

చల్లటి నీటితో స్నానం చేయడమే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుంటారు. చర్మ సంబంధిత సమస్యలు మొదలు ఎన్నో ఇతర సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటుంటారు. ఇక చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కూడా చాలా మంది భావిస్తుంటారు. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం వెంటనే రిఫ్రెష్ అవుతుంది. శరీరానికి ఇన్‌స్టంట్ ఎనర్జీ వస్తుంది. చల్లటి నీటితో స్నానం చేసిన వెంటనే ఉల్లాసంగా ఉంటారు. అలాగే చల్లని నీరు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది మీ చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఎంత టెన్షన్, ఒత్తిడి ఉన్నా బలదూర్ అవుతుందని చెబుతున్నారు. అయితే రోగ నిరోధక శక్తి బలపడుతుందా అంటే మాత్రం. కచ్చితంగా అవుననే సమాధానం చెప్పలేమని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తిని బలోపేతం కావాలంటే చల్లటి నీటితో స్నానం చేస్తే సరిపోదని. తీసుకునే ఆహారంలో కూడా ఎన్నో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

జపనీస్ మచా ఫ్లేవర్ టీతో

ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు

మనదేశంలో టీ ఫ్యాన్స్ కు కొదవ లేదు. చాలా మందికి పొద్దునే ఓ కప్పు టీతాగితే డే స్టార్ట్ కాదు. ఇక ప్రస్తుతం మార్కెట్ లో రకరకాల టీ ఫ్లేవర్లు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే లేటెస్ట్ గా జపనీస్ మచా ఫ్లేవర్ టీ ట్రెండ్ అవుతోంది. అసలు ఈ టీ ప్రయోజనం ఏమిటి? దీంతో లాభాలు ఏంటి? ఈ టీని ఎలా తయారుచేస్తారు? ఈ కథనంలో తెలుసుకుందాం..!

మాచా ఫ్లేవర్ టీ ..

భారత్ లో టీ ఎంత ప్రాచుర్యం పొందిందో జపాన్ లో మచా ఫ్లేవర్ టీ కూడా అంతే ప్రాధాన్యత కలిగి ఉంది. రుచి మాత్రమే కాదు ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పోషకాలు ఇందులో ఉన్నాయి. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ గ్రీన్ టీ 'మచ్చా', దీనిని జపనీస్ మచా అని కూడా పిలుస్తారు. ఈ టీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతోంది. 'మచా' గ్రీన్ టీ ఆకులను గ్రైండ్ చేసి పొడి తయారు చేస్తారు. ఈ టీలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఎనర్జీ, డిటాక్సిఫికేషన్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ టీ తో కలిగే లాభాల కోసం ఇంకా అనేక ప్రయోగాలు కొనసాగుతున్నాయి.

చుండ్రుకు చెక్ పెట్టండిలా..!

చుండ్రు ఈ సమస్య అందరినీ వేదిస్తోంది. అసలు చుండ్రును ఎలా పోగొట్టుకోవాలా.. ప్రస్తుత జీవనశైలి, ఆరోగ్య సమస్యలతో చాలా మందికి చుండ్రు సమస్యగా మారింది. ఇక నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, కెమికల్స్‌తో కూడిన షాంపూలు వాడడం కూడా ఓ కారణమని చెబుతున్నారు. చుండ్రును తగ్గించుకోవడానికి మార్కెట్లో లభించే రకరకాల షాంపూలను, నూనెలను ఉపయోగిస్తుంటారు. అయితే ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఉపశమనం లభించకపోతే బిర్యానీ ఆకులతో నేచురల్ చిట్కా పాటిస్తే.. చుండ్రు ఇట్టే పరార్ అవుతుంది. బిర్యానీ ఆకులోని ఔషధ గుణాలు చుండ్రును తరిమేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బిర్యానీ ఆకుల ద్వారా కేవలం చుండ్రు మాత్రమే కాకుండా.. తలపై ఉండే వాపు, దురద, దద్దుర్లు, పొడి బారడం వంటి సమస్యలను దూరం అవుతాయి. ఇంతకీ బిర్యానీ ఆకులతో హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఇలా చేయండి..!

బిర్యానీ ఆకులను తీసుకొని, కొన్ని నీళ్లు పోసుకొని బాగా మరిగించాలి. ఆకులు పూర్తిగా మరిగిన తర్వాత, చల్లార్చి బిర్యానీ ఆకులను మిక్సీ పట్టుకోవాలి. అలాగే అందులో.. కాస్త వేప ఆయిల్ లేదా అలోవెరా జెల్, డుసిరి పొడి లాంటివి యాడ్ చేసి మిక్స్ చేయాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించాలి. ఇలా ఓ ఐదు నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత పావుగంట పాటు ఆరబెట్టాలి. ఆ తర్వాత షాంపూతో తలను శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే మార్పు ఇట్టే కనిపిస్తుంది.

గుడ్డుతో ఇన్ని ప్రయోజనాలా?

గుడ్డు వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి రోజూ ఒక్క గుడ్డు తినాలని సూచిస్తున్నారు. గుడ్డు ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఫుడ్ గా ప్రజాదరణ పొందింది. అవసరమైన పోషకాలు, విటమిన్లతో నిండి గుడ్లు వివిధ వంటకాల్లో చేర్చగల బహుముఖ పదార్థం. ఇకపోతే ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. గుడ్లు పోషక శక్తివంతమైనవి. వీటిలో అధిక స్థాయిలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి మొత్తం ఆరోగ్యానికి ఎంతగానో అవసరం. వాటిని మీ ఆహారంలో ఎలా చేర్చాలో ఒకసారి చూద్దాం.

ప్రొటీన్ పుష్కలం

గుడ్లల్లో అధికంగా ప్రొటీన్ ఉంటుంది. ఇది శరీరంలో కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి అవసరం. ప్రోటీన్ మిమ్మల్ని పూర్తిగా, సంతృప్తిగా ఉంచడానికి కూడా సహాయపడుతుంది. వారి బరువును నిర్వహించాలని కోరుకునే వారికి గుడ్లు గొప్ప ఎంపికగా చేస్తాయి. గుడ్లలో విటమిన్ డి, విటమిన్ బి 12, సెలీనియం, కోలిన్ వంటి విటమిన్లు అలాగే మరికొన్ని ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యకరమైన ఎముకలు, మెదడు పనితీరు, జీవక్రియను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

గుండె ఆరోగ్యానికి మంచిది:

ప్రజాదరణ పొందిన నమ్మకానికి విరుద్ధంగా, గుడ్లు వాస్తవానికి గుండె ఆరోగ్యానికి మంచివి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడే ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి.

కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది

గుడ్లు లుటిన్, జియాక్సాంటిన్ వాటికి మంచి మూలం. ఇవి కంటి ఆరోగ్యానికి ప్రయోజనకరమైన రెండు యాంటీఆక్సిడెంట్లు. ఈ పోషకాలు వయస్సు సంబంధిత క్షీణత నుండి కళ్ళను రక్షించడానికి, మంచి దృష్టిని నిర్వహించడానికి సహాయపడతాయి.

కండరాల పునరుద్ధరణలో సాయం

గుడ్లలో అధిక ప్రోటీన్ కంటెంట్ వాటిని వ్యాయామం తర్వాత గొప్ప చిరుతిండిగా చేస్తుంది. వ్యాయామం తర్వాత గుడ్లు తినడం కండరాల పునరుద్ధరణను వేగవంతం చేయడానికి, కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది.

పటిక బెల్లం తింటే .. అరోగ్యం

పటికబెల్లం అద్భుతమైన ఆహారమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చక్కెర, బెల్లం స్థానంలో దీన్ని వాడటం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. పటిక బెల్లం చెరకు రసం నుంచి తయారు చేస్తారు. తెల్ల చక్కెరలాగా దీన్ని ప్రాసెసింగ్ చేయరు. అయితే పటికబెల్లంతో లాభాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.

పోషకాలు సమృద్ధిగా:

పటిక బెల్లంలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, ఇతర ఖనిజాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగా వైట్ షుగర్ ప్రాసెసింగ్ చేసే క్రమంలో దానిలో ఉండే సహజసిద్ధమైన పోషకాలు బయటకు వెళ్లిపోతాయి. కానీ పటికబెల్లంలో అన్ని పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతన్నారు.

రోగనిరోధక శక్తి కోసం కూడా..

పటిక బెల్లంలో రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు కూడా ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడానికి, అలాగే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఈ సహజ స్వీటెనర్ ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించడానికి, అలాగే మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. పటిక బెల్లం అనేది తెల్ల చక్కెర లాగా రక్తంలో చక్కెర స్థాయిలలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణం కాదు. ఇది తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. అంటే ఇది జీర్ణమవుతుంది. ఇంకా మరింత నెమ్మదిగా గ్రహించబడుతుంది. ఇది రక్తంలో చక్కెర వచ్చే చిక్కులను నివారించడానికి సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి లేదా వారి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించాలని కోరుకునే వారికి ఇది మంచి ఎంపిక.

జీర్ణక్రియకు తోడ్పడుతుంది

పటిక బెల్లం జీర్ణ ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది సహజ విరేచనాల మందుగా కూడా పనిచేస్తుంది. అలాగే ప్రేగు కదలికలను ప్రేరేపించడం ద్వారా.. జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పటిక బెల్లంలో ఉండే ఖనిజాలు పోషకాలను గ్రహించడంలో కూడా సహాయపడతాయి. మొత్తం గట్ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.

పోషకాల గని నువ్వులు.. తరుచూ తింటే?

నువ్వులు ఆరోగ్య ప్రయోజనాల కోసం, వంటలలో ఉపయోగం కోసం కొన్ని శతాబ్దాలుగా ఉపయోగించబడుతున్న శక్తివంతమైన పోషక శక్తులు. ఈ నువ్వులు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి సమతుల్య ఆహారంలో చేర్చినప్పుడు అనేకరకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇకపోతే నువ్వుల వల్ల కలిగే అనేక ఆరోగ్య ప్రయోజనాలను, అలాగే వాటిని మీ దినచర్యలో చేర్చడాన్ని ఎందుకు పరిగణించాలో ఒకసారి చూద్దాం.

పోషకాలు సమృద్ధిగా ఉంటాయి:

నువ్వులు మొత్తం ఆరోగ్యం, శరీర శ్రేయస్సును ప్రోత్సహించగల కీలక పోషకాలతో నిండి ఉంటాయి. అవి రాగి, మాంగనీస్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, భాస్వరం, జింక్, విటమిన్ బీ6 లాంటి వాటికి అద్భుతమైన మూలం. ఈ పోషకాలు ఎముక ఆరోగ్యం, శక్తి ఉత్పత్తి, రోగనిరోధక వ్యవస్థ మద్దతుతో సహా వివిధ శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తాయి.

గుండె ఆరోగ్యం

నువ్వులలో మోనోశాచురేటెడ్ కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వులు. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. వీటిలో ఫైటోస్టెరాల్స్ కూడా ఉంటాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయని తేలింది. అంతేకాకుండా నువ్వులు సెసమోల్, సెసమిన్ వంటి యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుండి గుండెను రక్షించగలవు.

జీర్ణ ఆరోగ్యం

నువ్వులు డైటరీ ఫైబర్ కు మంచి మూలం. ఇది జీర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం. ఫైబర్ మలానికి పెద్ద మొత్తంలో జోడించడం ద్వారా మలబద్ధకాన్ని నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా నువ్వులలో లిగ్నాన్స్ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ప్రయోజనకరమైన బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తూ గట్ మైక్రోబయోటాపై ప్రీబయోటిక్ ప్రభావాన్ని చూపుతాయని తేలింది.

ఎముకల ఆరోగ్యం

నువ్వులలో కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముక ఆరోగ్యానికి అవసరమైన ఖనిజాలు. ఈ ఖనిజాలు బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బోలు ఎముకల వ్యాధి, పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మీ ఆహారంలో నువ్వులను చేర్చడం, ఎముక సాంద్రత, మొత్తం అస్థిపంజర ఆరోగ్యానికి సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్ గుణాలు

నువ్వులు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు వాపును తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, మొత్తం ఆరోగ్యం, శరీర శ్రేయస్సుకు సహాయపడతాయి. మీ ఆహారంలో నువ్వులను చేర్చడం వల్ల దీర్ఘాయువును ప్రోత్సహించడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి సహాయపడుతుంది.

జైనాబ్‌పై అలాంటి విమర్శలు..

అక్కినేని అఖిల్, జైనాబ్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. గత ఏడాది జూన్‌లో పెద్దల సమక్షంలో ఘనంగా వివాహం చేసుకున్న ఈ జంటపై ఇప్పటికీ దారుణమైన ట్రోలింగ్ జరుగుతోంది. అయితే పెళ్లి నాటి నుంచి వారి మధ్య ఉన్న వయసు వ్యత్యాసం, మతం వంటి విషయాలపై సోషల్ మీడియాలో నిరంతరం విమర్శలు వస్తున్నాయి. ఈక్రమంలో.. తాజాగా ఈ తీవ్రమైన ట్రోలింగ్‌పై అఖిల్ మొదటిసారి స్పందించారు. తమ మధ్య ఉన్న వయసు, మతం వంటి విషయాలు తనకు ఏమాత్రం సమస్య కాదని అఖిల్ స్పష్టం చేశారు. పెళ్లికి ముందే వీటన్నింటిపై తామిద్దరం స్పష్టంగా చర్చించుకున్నామని చెప్పారు. కొన్ని నెలల పాటు వచ్చే ట్రోలింగ్ గురించి ఆలోచించాలా లేదా రాబోయే 50 ఏళ్ల తమ సంతోషకరమైన జీవితం గురించి ఆలోచించాలా అని ఆలోచించి, నెగెటివిటీని పట్టించుకోవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పెళ్లి తర్వాత ఇలాంటి పోస్టులు వస్తాయని ముందే జైనాబ్‌కు చెప్పి మానసికంగా సిద్ధం చేశానని, వచ్చిన ప్రతి ట్రోల్‌ను ఒక దీవెనగా భావించామని అన్నారు. కులం, మతం, వయసు కంటే తమ మధ్య ఉన్న ప్రేమ, అపగాహనే గొప్పదని ఆయన పేర్కొన్నారు. తాను మానసికంగా, శారీరకంగా కష్టాల్లో ఉన్న సమయంలో జైనాబ్ ఇచ్చిన సపోర్ట్ వల్లే తమ బంధం మరింత బలపడిందని చెప్పారు. సోషల్ మీడియా ట్రోల్స్ నుంచి ఆమెను రక్షించినప్పటికీ, జైనాబ్ ఈ విషయంలో ఎంతో పరిణతితో వ్యవహరించిందని ప్రశంసలు కురిపించారు. తమ ఐదేళ్ల రిలేషన్‌షిప్‌లో ఆమె తనను బాగా అర్థం చేసుకుందని వెల్లడించారు. కాగా.. అఖిల్ సినిమాల విషయానికొస్తే.. గత కొద్ది కాలంగా ఫ్లాపుల్లో ఉన్న ఆయన ఇటీవల లెనిన్ చిత్రంలో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. మురళి కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్స్ కూడా రాబట్టింది. మూడేళ్ల గ్యాప్ తర్వాత గట్టి కంబ్యాక్ ఇచ్చిన అఖిల్ అయ్యాగారే నంబర్‌వన్ అని అనిపించుకున్నారు.

మెగా కోడలు లావణ్య త్రిపాఠి లుక్‌పై ట్రోలింగ్..

టాలీవుడ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి, మెగా హీరో వరుణ్‌తేజ్ కొన్నేళ్ల పాటు ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట పర్సనల్ లైఫ్‌ను ఎంతో ఆనందంగా గడుపుతున్నారు. ఇక గతేడాది ఈ మెగా కపుల్ జీవితంలోకి ఒక బుజ్జాయి అడుగుపెట్టాడు. వీరికి ఓ పండంటి మగబిడ్డ జన్మించగా, ఆ బాబుకి 'వాయువ్ తేజ్' అని నామకరణం చేసి తమ బిడ్డతో ఎంతో సంతోషంగా గడుపుతున్నారు. అయితే తల్లి అయిన తర్వాత మెగా కోడలు లావణ్య త్రిపాఠి సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. పూర్తిగా తన కొడుకు బాగోగులు చూసుకుంటూ ఇంట్లోనే సమయాన్ని గడుపుతున్నారు. ఈనే పథ్యంలో.. తాజాగా హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి లావణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న లావణ్య, గతంతో పోలిస్తే కొంత బరువు పెరిగి బొద్దుగా కనిపించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారాయి. అయితే అది చూసిన కొందరు నెటిజన్లు దారుణమైన ట్రోలింగ్ మొదలుపెట్టారు. ఒక్క బిడ్డను కనగానే ఆంటీలా మారిపోయిందంటూ ఆమె రూపాన్ని హేళన చేస్తూ అసభ్యకరమైన కామెంట్లు పెడుతున్నారు. ఈ దారుణమైన ట్రోలింగ్‌పై మెగా అభిమానులు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గర్భధారణ, ప్రసవం తర్వాత ఏ మహిళ శరీరంలోనైనా మార్పులు రావడం పూర్తిగా సహజమైన విషయమని స్పష్టం చేస్తున్నారు. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ప్రతి తల్లి శారీరకంగా, మానసికంగా పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం ఖచ్చితంగా అవసరమని గుర్తు చేస్తున్నారు. మహిళల శరీరంలో వచ్చే ఇలాంటి సహజమైన మార్పులను సమాజం గౌరవించాలని, అంతేకానీ అలాంటి పవిత్రమైన సమయంలో ఒక మహిళ రూపాన్ని హేళన చేయడం, బాడీ షేమింగ్ చేయడం ఎంతమాత్రం సరికాదని ట్రో లర్లను గట్టిగా హెచ్చరిస్తున్నారు.

అది నా విషయంలో జరిగాకే తెలుసుకున్నా!: అదాశర్మ

వైవిధ్యమైన చిత్రాలతో.. తెరపై కొత్తదనం నిండిన పాత్రల్లో కనిపిస్తూ తనదైన నటనతో ఆకట్టుకుంటుంది హీరోయిన్ అదాశర్మ. ఇప్పడామె భాషలతో సంబంధం లేకుండా విభిన్నమైన జానర్లలో అలరించేందుకు సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రాంతీయ పరిశ్రమలు బలమైన నాయికా ప్రాధాన్య పాత్రలను అందిస్తున్నాయా అనే ప్రశ్నకు స్పందిస్తూ...''మంచి కథలు ఏ పరిశ్రమ నుంచైనా రాగలవని అనుకుంటున్నాను. హిందీ, తెలుగు ఇప్పడు మరాఠీ చిత్రసీమలో పనిచేసే అవకాశం నాకు దక్కింది. ప్రతి పరిశ్రమ నాకు గుర్తుండిపోయే నాయికా ప్రాధాన్య పాత్రలనే ఇచ్చింది. మన ఖాతాలో ఒక సినిమా హిట్ అయ్యాకే.. అందరికీ మన నటనపై నమ్మకం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇస్తారు. ఇది నా విషయంలో జరిగాకే తెలుసుకున్నా. అందుకే ప్రతి నటి కోరుకునే సవాలుతో కూడిన భిన్నమైన పాత్రలు నాకు దక్కుతున్నాయ''ని చెప్పింది. అదా 'గజ్రా' అనే మరాఠీ చిత్రంతోపాటు, 'సూపర్ వెల్లి' అనే సూపర్ హీరో సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల్ని పలకరించనుంది.

మీరు మీలా ఉంటే.. చాలు

చిత్రసీమలో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకూ.. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని అలరిస్తోంది అందాల తార రష్మిక. అగ్రతారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూనే నాయికా ప్రాధాన్య చిత్రాలను తన ఖాతాలో వేసుకుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో కథానాయికగా సత్తా చాటుతున్న ఈ భామ ఇటీవల ఓ కార్యక్రమంలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. "ఏ మూస పద్ధతిలోనూ ఇమడకుండా పూర్తిగా కొత్త చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం నా జీవితంలోని అద్భుతమైన ప్రయాణం. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ ప్రణాళిక ఉండేది. అందుకే నాకు మొదట్లో భయంగా అనిపించింది. కానీ, నేను నా అంతరాత్మ చెప్పిందే అనుసరించేదాన్ని. కెరీర్‌లో ఇప్పడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలిపిందని అనిపిస్తుంది. మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా చూపే విషయాలే మనకు అతిపెద్ద బలం అని తెలుసుకున్నాను. అందరిలో కలిసిపోవాలనుకుని.. వారితో ప్రతి విషయంలోనూ ఇమిడిపోవాల్సిన అవసరం లేదు. మీరు మీలా ఉంటే చాల"ని చెప్పుకొచ్చింది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S